సాక్షి
జనగామ
సోమవారం | 4 | డిసెంబర్ | 2023



పోస్టల్ బ్యాలెట్ కాంగ్రెస్‌దే..

- ఉద్యోగుల మద్దతు హస్తం పార్టీకే - 12లో▸

ఎమ్మెల్యేలుగా ఇద్దరు ఎమ్మెల్సీలు..

- బీఆర్‌ఎస్ నుంచి కడియం, పల్లా గెలుపు

వికసించని కమలం..

- ఉమ్మడి జిల్లాలో చతికిలపడిన బీజేపీ

ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయం..

- 12లో▸

- నూతన ఎమ్మెల్యేల మనోగతం

వాతావరణం

గరిష్టం/కనిష్టం $31.1^0/20.3^0$

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత మామూలుగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

వర్ధన్నపేట నియోజకవర్గం



కేఆర్.నాగరాజు (కాంగ్రెస్)
మెజారిటీ : 17,927
వచ్చిన ఓట్లు : 1,04,717

అరూరి రమేశ్ (బీఆర్‌ఎస్)
వచ్చిన ఓట్లు: 86,790

కొండేటి శ్రీధర్ (బీజేపీ)- వచ్చిన ఓట్లు 11,966

వరంగల్ పశ్చిమ



నాయిని రాజేందర్ రెడ్డి (కాంగ్రెస్)
మెజారిటీ : 15,331
వచ్చిన ఓట్లు : 72,649

దాస్యం వినయ్ భాస్కర్ (బీఆర్‌ఎస్)
వచ్చిన ఓట్లు: 57,318

రావు పద్మ (బీజేపీ) వచ్చిన ఓట్లు: 30,826

వరంగల్ తూర్పు



కొండా సురేఖ (కాంగ్రెస్)
మెజారిటీ : 15,043
వచ్చిన ఓట్లు : 66,725

ఎర్రబెల్లి ప్రదీప్‌రావు (బీజేపీ)
వచ్చిన ఓట్లు: 51,682

నన్నపునేని నరేందర్ (బీఆర్‌ఎస్), ఓట్లు : 42,535

పరకాల



రేవూరి ప్రకాశ్‌రెడ్డి (కాంగ్రెస్)
మెజారిటీ : 7,941
వచ్చిన ఓట్లు : 72,573

చల్లా ధర్మారెడ్డి (బీఆర్‌ఎస్)
వచ్చిన ఓట్లు: 64,632

డాక్టర్ కాళీప్రసాదరావు (బీజేపీ), ఓట్లు: 38,735

పాలకుర్తి



యశస్వినిరెడ్డి (కాంగ్రెస్)
మెజారిటీ : 47,129
వచ్చిన ఓట్లు : 1,25,414

ఎర్రబెల్లి దయాకర్ రావు (బీఆర్‌ఎస్)
వచ్చిన ఓట్లు: 78,285

వెంకట్‌రెడ్డి(స్వతంత్ర) ఓట్లు: 4,087

జనగామ



పల్లా రాజేశ్వర్ రెడ్డి (బీఆర్‌ఎస్)
మెజారిటీ : 16,418
వచ్చిన ఓట్లు : 98,557

కొమ్మూరి ప్రతాప్ రెడ్డి (కాంగ్రెస్)
వచ్చిన ఓట్లు: 82,139

ఆరుట్ల దశమంత రెడ్డి (బీజేపీ), ఓట్లు: 7,595

రెండు బీఆర్‌ఎస్.. ఒకటి కాంగ్రెస్





గెలిచిన అనంతరం స్టేషన్ ఘన్‌పూర్, జనగామ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఎత్తుకున్న కార్యకర్తలు



కౌంటింగ్ కేంద్రం వద్ద నమస్కరిస్తున్న యశస్వినిరెడ్డి

- మూడు చోట్ల బీజేపీ డిపాజిట్ల గల్లంతు
- పోలింగ్ కేంద్రం మెట్లు ఎక్కని ఎర్రబెల్లి, ఇందిర
- దయాకర్‌రావు రాకపోవడంపై సర్వత్రా చర్చ

జనగామ/దేవరుప్పుల/లింగాలఘనపురం/తొర్రూర్/కొడకండ్ల: ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ హవా వీచినా జిల్లాలో మాత్రం మూడు నియోజక వర్గాలకుగానూ రెండు బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి భారీ మెజారిటీ సాధించి నలభై ఏళ్లనాటి వైభవం చాటుకుంది. జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి బీఆర్‌ఎస్ నుంచి విజయం సాధించి ఆధిక్యతను చాటారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు మాజీ మంత్రి గుండె విజయ రామారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లేగ రాంమోహన్‌రెడ్డి డిపాజిట్లను కోల్పోయారు. జిల్లాలో ఇటీవల పట్టు పెంచుకున్న నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో తమ ప్రాబల్యాన్ని చూపలేకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా జనగామలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి 98,975 ఓట్లు రాగా ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి 83,189 ఓట్లు రాగా 20 రౌండ్ల లెక్కింపులో చివరి రౌండ్ మినహాయించి మిగితా అన్ని రౌండ్లలో ఆధిక్యతతో 15,786 ఓట్ల మెజారిటీతో బీఆర్‌ఎస్ గెలిచింది. స్టేషన్‌ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరికి 1,01,689 ఓట్లు రాగా ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి ఇందిరకు 93,917 ఓట్లు రాగా 21 రౌండ్లలో 13 రౌండ్లలో ఆధిక్యతతో 7,772 ఓట్ల మెజార్టీతో బీఆర్‌ఎస్ గెలుపొందారు.



కౌంటింగ్ కేంద్రంలో ఈవీఎంల ఓట్ల లెక్కింపు

పాలకుర్తిలో కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డికి 1,25,414 ఓట్లు రాగా బీఆర్‌ఎస్ అభ్యర్థి దయాకర్‌రావుకు 78,285 ఓట్లు రాగా 21 రౌండ్లలో రెండో రౌండ్ మినహా అన్ని రౌండ్లలో కూడా ఆధిక్యతతో 47,129 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ గెలుపొందింది.

పోలింగ్ కేంద్రం మెట్లు ఎక్కని ఎర్రబెల్లి, ఇందిర

ఈ నెల 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్ సర్వేలా ఆధారంగా పాలకుర్తిలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్టేషన్‌ఘన్‌పూర్‌లో సింగపురం ఇందిర ఓటమి ఎరిగి ఆదివారం పోలింగ్ కేంద్రం మెట్టు ఎక్కని వైనంపై సర్వత్రాచర్చకొనసాగింది.

'పల్లా'కు జైకొట్టిన 'జనగామ'

జనగామ: రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీచినా.. జనగామ ప్రజలు కారు గుర్తు పల్లా రాజేశ్వర్‌రెడ్డికి జై కొట్టారు. ప్రచారంలో తన దైన శైలితో ఓటర్లను ఆకట్టుకున్న పల్లా, గెలుపు విషయంలో మొదటి నుంచి అదే ధీమాను వ్యక్తం చేశారు. జనగామలో ఉంటా.. ప్రజల సమస్యలు పరిష్కరిస్తా.. సీఎం వద్దకు వెళ్లి అభివృద్ధికి పైసలు తెస్తా అనే నినాదంతో పల్లా గెలుపు వాకిట సక్సెస్ అయ్యారు.

జనగామ చరిత్రలో రికార్డు మెజార్టీ

జనగామ నియోజకవర్గ చరిత్రలో ఏ అభ్యర్థికి రాని మెజార్టీ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి రాగా.. కాంగ్రెస్‌కు సైతం ఓట్ల శాతం పెరిగింది. ప్రస్తుత సాధారణ ఎన్నికల్లో 2,01,940 ఓట్లు పోలవగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి 98,557 ఓట్లు సాధించగా, కాంగ్రెస్ నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి 82,139 ఓట్లు సాధించారు. ఇద్దరికి వచ్చిన ఓట్ల శాతంలో గతంలో ఎప్పుడు కూడా ఈ రెండు పార్టీలకు ఈ స్థాయిలో ఓట్లు పోలు కాలేదు.

ఉత్కంఠ రేపిన ఎన్నికలు

పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఎక్కడ కూడా అడ్డంకి కాకుండా.. పల్లా ప్రచారం చేపట్టారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు నెలరోజుల ముందు నుంచి రాజేశ్వర్‌రెడ్డి నియోజకవర్గంలో పర్యటిస్తుంటే.. కాంగ్రెస్ టికెట్ ప్రకటించడం ఆలస్యం కావడంతో ప్రచారంలో కొంత మేర వెనకబడ్డారని చెప్పుకోవచ్చు. చివరకు పల్లా విజయ కేతనం ఎగుర వేశారు.







గెలుపు ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి

ఓటింగ్ సాగింది ఇలా..



కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు



పోలింగ్ ఏజెంట్లను తనిఖీ చేస్తున్న అధికారులు

- ఆలస్యంగా రౌండ్ల లెక్కింపు
- లెక్కింపు హాల్ వద్ద మూడంచెల భద్రత

జనగామ/దేవరుప్పుల/లింగాలఘనపురం/జనగామ రూరల్/తొర్రూరు/తరిగొప్పుల : జనగామ మండలం పెంబర్తి విద్యాభారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఆదివారం జరిగిన జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లతో ప్రారంభమైంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య ఆధ్వర్యంలో సెంట్రల్ అబ్జర్వర్ల పర్యవేక్షణలో ఆర్‌ఓలు మురళీకృష్ణ, రామ్మూర్తి, రోహిత్‌సింగ్ ఎలక్షన్ విధులు నిర్వహించారు. ఉదయం 7 గంటల లోపే అధికారులు కౌంటింగ్ హాలుకు చేరుకోగా, అభ్యర్థులు, పార్టీల ఏజెంట్లు 7.30 వరకు వచ్చారు. ఉద్యోగుల పోస్టల్ ఓట్లతో పాటు హోం ఓటింగ్‌కు సంబంధించి 4,861 ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలు పెట్టారు. 8.30 గంటలకు ఈవీఎంలను ఓపెన్ చేయగా...కౌంటింగ్ ప్రక్రియ ఆలస్యంగా జరిగింది. రాష్ట్రంలో అనేక జిల్లాలో మొదటి, రెండవ రౌండ్ ఫలితాలు వచ్చినా..ఇక్కడ మాత్రం లెక్కింపు ప్రక్రియతోనే సరిపెట్టారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభమైన లెక్కింపు ప్రక్రియ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగగా, పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్ రాత్రి వరకు కొనసాగింది. వీబీఐటీ ప్రాంగణంలో మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేసి, బిగ్‌స్క్రీన్ ద్వారా ఫలితాలను అందించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరుగకుండా డీసీపీ పి.సీతారాం ఆధ్వర్యంలో ఏసీపీ దేవందర్‌రెడ్డి, సీఐలు, ఎస్‌ఐలు, బీఎస్‌ఎఫ్, సెంట్రల్ బలగాలు, సివిల్, ఆర్మడ్ బృందాలు నిఘా ఉంచాయి. కౌంటింగ్ హాలులోకి మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు చేసిన తర్వాతనే లోనికి అనుమతించారు. కాగా కౌంటింగ్ ప్రక్రియను కంట్రోల్ రూం నుంచి సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించారు. కాగా కౌంటింగ్ హాలు వద్ద ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, వాటర్ బాటిల్స్ కోసం ఆయా పార్టీల కేడర్ పలువురు అధికారులు, జర్నలిస్టులు, కార్మికులకు కష్టాలు తప్ప లేదు. ఫుడ్ సెక్షన్‌లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గందరగోళంగా మారింది.


నాయకుల సంబురాలు

జనగామ/దేవరుప్పుల/తొర్రూరు/కొడకండ్ల/లింగాలఘనపురం/జనగామ రూరల్/తరిగొప్పుల: జిల్లాలో ఓట్ల లెక్కింపులో ఆధిక్యత పొంది గెలిచిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణులు విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. పెంబర్తిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనుచరులు ఆనందహోత్సవంతో ఎత్తుకొని శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డికి అత్తమామలు ఝాన్సీరెడ్డి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. మూడు నియోజకవర్గాలకు గాను రెండు చోట్ల కాంగ్రెస్ ఓడినా ప్రభుత్వం తమదే అంటూ కాంగ్రెస్, పాలకుర్తి నియోజకవర్గంలో ఊరూరా కాంగ్రెస్ కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు.



నర్మెటలో బాణసంచా కాల్చుతున్న నాయకులు

స్టేషన్ ఘన్‌పూర్




కడియం శ్రీహరి (బీఆర్‌ఎస్)
మెజారిటీ : 7,772
వచ్చిన ఓట్లు : 1,01,689

సింగపురం ఇందిర (కాంగ్రెస్)
వచ్చిన ఓట్లు: 93,917

జి.విజయ రామారావు (బీజేపీ), ఓట్లు: 4,931

భూపాలపల్లి



గండ్ర సత్యనారాయణ రావు (కాంగ్రెస్)
మెజారిటీ : 52,699
వచ్చిన ఓట్లు : 1,23116

వెంకటరమణారెడ్డి (బీఆర్‌ఎస్)
వచ్చిన ఓట్లు: 70,417

చందుపట్ల కీర్తిరెడ్డి (బీజేపీ), ఓట్లు: 14,731

ములుగు



ధనసరి సీతక్క (కాంగ్రెస్)
మెజారిటీ : 33,700
వచ్చిన ఓట్లు : 1,02,267

బడే నాగజ్యోతి (బీఆర్‌ఎస్)
వచ్చిన ఓట్లు: 68,567

ప్రహ్లాద్‌నాయక్ (బీజేపీ), ఓట్లు: 5,388

మహబూబాబాద్



డా.మురళీనాయక్ (కాంగ్రెస్)
మెజారిటీ : 50,171
వచ్చిన ఓట్లు : 1,16,644

శంకర్‌నాయక్ (బీఆర్‌ఎస్)
వచ్చిన ఓట్లు: 66,473

జాటోత్ హుస్సేన్ నాయక్ (బీజేపీ), ఓట్లు: 17,038

నర్సంపేట



దొంతి మాధవరెడ్డి (కాంగ్రెస్)
మెజారిటీ : 18,889
వచ్చిన ఓట్లు : 1,04,185

పెద్ది సుదర్శన్‌రెడ్డి (బీఆర్‌ఎస్)
వచ్చిన ఓట్లు: 85,296

కంభంపాటి పుల్లారావు (బీజేపీ), ఓట్లు: 3,062

డోర్నకల్



రాంచంద్రునాయక్ (కాంగ్రెస్)
మెజారిటీ : 53,131
వచ్చిన ఓట్లు : 1,15,587

రెడ్యానాయక్ (బీఆర్‌ఎస్)
వచ్చిన ఓట్లు: 62,456

రత్న అజ్మీరా (స్వతంత్ర), ఓట్లు: 2,773

నాడు 'యతి' ట్రిక్స్.. నేడు 'ఝాన్సీ' పాలిటిక్స్

- షాడో రాజకీయ ఆధిపత్యం ఫలించిన వైనం



నెమరుగొమ్ముల యతిరాజారావు, విమలాదేవి



హనుమాండ్ల ఝాన్సీరెడ్డి,మామిడాల యశస్వినిరెడ్డి

దేవరుప్పుల: అసెంబ్లీ ఎన్నికల చరిత్రలో చెన్నూరు (పాలకుర్తి) నియోజకవర్గంలో అప్పట్లో పలు కారణాలతో కాంగ్రెస్ పక్షాన ఎమ్మెల్యే బరిలో నిలిచే అర్హత కోల్పోయిన యతి రాజారావు అనూహ్యంగా తన సతీమణి విమలాదేవిని నిలిపి విజయం సాధించిన ఘటన నేడు పునరావృతం కావడం సర్వత్రా చర్చించుకుంటున్నారు. 1967లో సోషలిస్టు పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన యతి రాజారావు పార్టీ నిబంధనలు ఉల్లంఘించిన తరుణంలో పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. దీంతో అప్పట్లో అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే పదవి ఆశించిన ఆయనకు పార్టీ టికెట్ కేటాయించిన చిక్కులు రావడంతో పట్టువీడని యతి తన భార్య విమలాదేవికి టికెట్టు సంపాదించారు. ప్రత్యర్థిగా కమ్యూనిస్టు పార్టీ పక్షాన విస్నూర్ దేశముఖ్‌ల విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సింహ స్వప్నంగా పేరొందిన నల్లా నర్సింహులు (కడవెండి)పై ఆమె విజయం సాధించడం సంచలనాన్ని కలిగించింది. తాజాగా మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన ఎర్రబెల్లి దయాకర్‌రావు సైతం ప్రత్యర్థి పార్టీ నుంచి ఎదురులేదనుకున్నారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని స్థానికురాలుగా ఎన్‌ఆర్‌ఐ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిని ఆరు నెలల కిందట రంగంలోకి దింపడంతో రాజకీయ రణరంగం మొదలైంది. అయితే నామినేషన్ ప్రక్రియ నాటికి ఝాన్సీరెడ్డికి పౌరసత్వం చిక్కులతో ఎన్నికల బరిలో నిలువని పరిస్థితి వచ్చిన విధితమే. ఈ సంఘటనతో ఇక పాలకుర్తిలో కాంగ్రెస్‌కు సరైన అభ్యర్థి కరువనుకున్న తరుణంలో అనూహ్యంగానే తన కోడలు మామిడాల యశస్వినిరెడ్డికి టికెట్టు సంపాదించి తన రాజకీయ అరంగేట్రాన్ని చాటడంతో నిరాశనిస్పృహలకు గురైన కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ అందుకుంది. పదిహేను రోజుల్లోనే ఎర్రబెల్లికి దీటుగా విస్తృత ప్రచారం చేపట్టే క్రమంలో పలు సవాళ్లు ఎదుర్కొన్నారు. ఏది ఏమైనా రాజకీయ ఆధిపత్యపోరులో నాడు ఎన్నికల బరిలో నిలిచే అర్హత కోల్పోయిన యతి బాటలో నేడు ఝాన్సీరెడ్డి చేసిన పాలిటిక్స్ తీరు ఫలించడంతో వరుస విజయాలతో రాజకీయ సంచలన చరిత్ర కలిగిన ఎర్రబెల్లి దయాకర్‌రావుకు కాంగ్రెస్ హవాతో చుక్కెదురు తప్పలేదు. గత ఎన్నికల్లో ఆయన గెలిచిన మెజార్టీతో దగ్గరలో మామిడాల యశస్వినిరెడ్డి గెలవడం గమనార్హం.

నైతిక విజయం నాదే..

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



జనగామ: జనగామ నియోజకవర్గంలో ఓటమి చెందినా, నైతిక విజయం తనదేనని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జనగామ మండలం వీబీఐటీలో ఆదివారం ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత కొమ్మూరి విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకుల ఓట్లు తొలగించి, ఆయనకు అనుకూలంగా ఉన్న వారిని ఓటరు జాబితాలో నమోదు చేసుకున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందారన్నారు. చేర్యాలలో కాంగ్రెస్ నాయకులకు సంబంధించిన 2వేల ఓట్లు ఓటరు జాబితా నుంచి తొలగించారన్నారు. జనగామ పట్టణంలో పల్లా కళాశాలలో పని చేసే 7వేల మంది కుటుంబ సభ్యుల ఓట్లను ఇక్కడ నమోదు చేయించి, గెలుపొందారన్నారు. అడ్డదారిలో నమోదు చేసుకున్న ఓట్లపై ఈసీకి ఫిర్యాదు చేసి, విచారణ చేయాలని కోరుతామన్నారు. గతంలో చేర్యాల ఎమ్మెల్యేగా ఈ ప్రాంత అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన తనను ఆశీర్వదించి, ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి, సేవ చేస్తానన్నారు.

మట్టి కరిచిన ఎర్రబెల్లి

- అనూహ్యంగా వచ్చి మంత్రినే ఓడించిన యశస్విని
- తొలి ఎన్నికల్లోనే సత్తా చాటిన యువ నాయకురాలు
- ఎమ్మెల్యేగా గెలిచిన పిన్న వయస్కురాలిగా రికార్డు

జనగామ/తొర్రూరు/కొడకండ్ల/దేవరుప్పుల: రాజకీయాలతో ప్రత్యక్షంగా అనుభవం లేని యువతి అసెంబ్లీ ఎన్నికల్లో విజయ దుందుభి మోగించారు. తొలి ఎన్నికలోనే 66 ఏళ్ల రాజకీయ నేత ఎర్రబెల్లిపై.. 26 ఏళ్ల యశస్వినిరెడ్డి విజయకేతనం ఎగురవేశారు. పాలకుర్తి అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొంది చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. 2018లో బీటెక్ పూర్తి చేసిన మామిడాల యశస్వినిరెడ్డి వివాహం అనంతరం అమెరికాకు వెళ్లారు. అక్కడ కొంతకాలం అత్తామామలకు సహకారంగా సొంత వ్యాపార కార్యకలాపాలు నిర్వహించారు. వాస్తవానికి పార్టీ అధిష్టానం తొలుత యశస్వినిరెడ్డి అత్త ఝాన్సీరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించింది. పౌరసత్వం విషయంలో అడ్డంకులు రావడంతో ఆమె పోటీ నుంచి తప్పుకున్నారు. అనూహ్యంగా ఆమె కోడలు యశస్వినిరెడ్డి పేరు తెరపైకి వచ్చింది. దీంతో ఆమె స్థానంలో కోడలు యశస్వినిరెడ్డికి అవకాశమివ్వాలని ఝాన్సీరెడ్డి పార్టీని కోరడంతో అధిష్టానం టికెట్ ఇచ్చింది. పాలకుర్తి అసెంబ్లీ చరిత్రలో తొలిసారి 26 ఏళ్ల పిన్న వయసుకురాలిగా యశస్విని గెలుపొందారు. పాత చెన్నూరు ప్రస్తుత పాలకుర్తి అసెంబ్లీలో ఎమ్మెల్యేగా గెలుపొందిన రెండో మహిళగా యశస్వినిరెడ్డి నిలిచారు.



మామిడాల యశస్వినిరెడ్డి

నలభై ఏళ్లకు చేతికి చిక్కిన అధికారం

గత నలభై ఏళ్లుగా ఈనియోజకవర్గంలో కాంగ్రెస్ పక్షాన ఎమ్మెల్యేగా ఎవ్వరూ గెలవలేదు. క్యాడర్ తీవ్ర అసంతృప్తిలో ఉన్న ప్రస్తుత తరుణంలో కాంగ్రెస్ హవా కొనసాగింది. ఈ నియోజకవర్గంలో చేతికి అధికారం చిక్కడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 1983లో అప్పటి చెన్నూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కుందూరు మధుసూదన్‌రెడ్డి గెలిచారు. అనంతరం టీడీపీ నుంచి యతిరాజారావు, డాక్టర్ సుధాకర్‌రావు, టీఆర్‌ఎస్ నుంచి దుగ్యాల శ్రీనివాసరావు, టీడీపీ నుంచి రెండుసార్లు, టీఆర్‌ఎస్ నుంచి ఒకసారి దయాకర్‌రావు గెలిచారు.

గులాబీలకు చేయిచ్చిన ప్రజలు..

జనగామ జిల్లాలోని మూడు నియోజకవర్గాలతో పోల్చుకుంటే పాలకుర్తిలో పదేళ్లుగా మంత్రి దయాకర్‌రావు గణనీయమైన అభివృద్ధి పనులు చేశారు. తాగు, సాగు, రోడ్లు, పల్లె ప్రగతి, పురాతన ఆలయాల పునరుద్ధరణ, యువతకు ఉపాధి దిశలో మహిళలకు స్వయం సమృద్ధి కోసం కుట్టు శిక్షణ వంటి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆరు మండలాల్లో ప్రభుత్వ వ్యతిరేకతతోపాటు పార్టీ క్యాడర్ తీరుపై అసంతృప్తితో ఎన్నికల ఫలితాలు తారుమారయ్యాయి. బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది.

నాడు 26.. నేడూ 26

పాలకుర్తి నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నిక చిత్రవిచిత్రాలకు నెలవుగా మారింది. గెలిచినా, ఓడినా అభ్యర్థులకు 26 సంఖ్యతో అనుబంధం ఉంది. 26 ఏళ్లకే ఎమ్మెల్యేగా గెలుపొంది 40 ఏళ్ల పాటు ఏకచక్రాధిపత్యంగా దయాకర్‌రావు రాజకీయం నడిపారు. ఆయనపై 26 ఏళ్ల యువతి గెలుపొంది చరిత్ర సృష్టించారు. 66 ఏళ్ల రాజకీయ ఉద్దండుడు 26 ఏళ్ల యువతి చేతిలో ఓడడం, ఏ వయసులో రాజకీయం ప్రారంభించాడో అదే వయసు యువతిపై ఓటమి పాలవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

పోస్టల్ బ్యాలెట్ కాంగ్రెస్‌దే..

శాసన సభ ఎన్నికల్లో వివిధ శాఖల ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తారు. అయితే వారు సాధారణ ఓటర్ల మాదిరి ఓటు వేయరు. వారి కోసమే ప్రత్యేకంగా ఏర్పాటు చేసే పోస్టల్ బాలెట్ ద్వారా వేస్తారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే తమ మద్దతు తెలిపారు. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 నియోజకవర్గాలకు సంబంధించి ఏ పార్టీ అభ్యర్థులకు ఎన్ని ఓట్లు వేశారనే వివరాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

ఉద్యోగుల మద్దతు హస్తం పార్టీకే ● ద్వితీయ స్థానంలో బీఆర్ఎస్, ఇతర పార్టీల అభ్యర్థులు



ఏనుమాముల మార్కెట్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తున్న అధికారులు

దొంతి మాధవరెడ్డికి 1004..

నర్సంపేట: పోస్టల్ బ్యాలెట్‌లో నర్సంపేట కాంగ్రెస్ అభ్యర్థి దొంతి మాధవరెడ్డికి 1004, బీఆర్ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డికి 295, బీజేపీ అభ్యర్థి కంభంపాటి పుల్లారావుకు 45, బీఎస్పీ అభ్యర్థి గుండాల మదన్‌కుమార్‌కు 4, ఇతరులకు 9 ఓట్లు వచ్చాయి. కాగా, మొత్తం 1,375 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మురళీనాయక్‌కు 1205..

మహబూబాబాద్: పోస్టల్ బ్యాలెట్‌లో ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీ మానుకోట అభ్యర్థి మురళీనాయక్‌కే పట్టం కట్టారు. ఇందులో ఆయనకు 1205 ఓట్లు వేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి శంకర్‌నాయక్‌కు 296, బీజేపీ అభ్యర్థి జాటోత్ హుస్సేన్ నాయక్‌కు 167, బీఎస్పీ అభ్యర్థి శేఖర్‌కు 13, స్వతంత్ర అభ్యర్థులు చక్రవర్తికి 5 , బిచ్చానాయక్‌కు 11, రాందాస్‌కు 6, ఉపేందర్‌కు 4, ఎస్ రమేష్ 4, బట్టు బిన్నమ్మ 8, గుగులోత్ వెంకన్నకు 5, నోటాకు 6, ఇన్ వాల్యువుడ్ ఓట్లు 34 వేశారు. మొత్తం 1764 ఓట్లు పోలయ్యాయి. కాగా, మరో స్వతంత్ర అభ్యర్థి డీవీ నాయక్‌కు ఒక్క ఓటు కూడా రాలేదు.

సీతక్కకు 1358..

ములుగు: శాసన సభ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సీతక్కకే ఉద్యోగులు పట్టం కట్టారు. సీతక్కకు మొత్తం 1358 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి నాగజ్యోతికి 240, బీజేపీ అభ్యర్థి ప్రహ్లాద్‌కు 126, స్వతంత్రులు భూక్య జంపన్నకు 11, నునావత్ చంద్రునాయక్‌కు 04, ఎం. మనోహర్‌కు 01, జోత్యిబసుకు 02, మద్దిళ్ల వెంకటేశ్వర్లుకు 01, వజ్జ సమ్మక్కకు 04 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మొత్తం 1,767.

నాయిని రాజేందర్‌రెడ్డికి 3031..

హన్మకొండ : పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డికే ఉద్యోగులు జై కొట్టారు. రాజేందర్‌రెడ్డికి మొత్తం 3031 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి రావు పద్మకు 894, దాస్యం వినయ్‌బాస్కర్‌కు 626 ఓట్లు పడ్డాయి.

రేవూరి ప్రకాశ్‌రెడ్డికి 829..

ఆత్మకూరు: పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్ పరకాల అభ్యర్థి రేవూరి ప్రకాశ్ రెడ్డి దుమ్ము లేపారు. ఇందులో ఆయనకు 829 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్‌కు 302, బీజేపీకి 149 ఓట్లు వచ్చాయి.

కేఆర్ నాగరాజుకు1979..

హసన్‌పర్తి: పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్ వర్ధన్నపేట అభ్యర్థి కేఆర్ నాగరాజు సత్తా చాటారు.ఆయనకు 1979 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేష్‌కు 448, బీజేపీ అభ్యర్థి కొండేటి శ్రీధర్‌కు 309 ఓట్లు వచ్చాయి.

ఇందిరకు 708..

స్టేషన్‌ఘన్‌పూర్ : పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్ స్టేషన్ ఘన్‌పూర్ అభ్యర్థి సింగపురం ఇందిరకు అధిక ఓట్లు పడ్డాయి. ఆమెకు 708 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి కడియ శ్రీహరికి 457,బీజేపీ అభ్యర్థి విజయ రామారావుకు 53 ఓట్లు వచ్చాయి.

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి 1050..

జనగామ : పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి విజయభేరి మోగించారు. ఆయనకు 1050 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి 418, బీజేపీ అభ్యర్థి దశమంత రెడ్డికి 139 ఓట్లు పోలయ్యాయి.

యశస్వినిరెడ్డికి 1180..

పాలకుర్తి : పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్ పాలకుర్తి అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి దూసుకెళ్లారు. ఆమెకు 1180 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు 418, బీజేపీ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డికి 43 ఓట్లు వచ్చాయి.

గండ్ర సత్యనారాయణ రావుకు 819..

భూపాలపల్లి : పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్ భూపాలపల్లి అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు విజృంభించారు. ఆయనకు 819 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డికి 236, బీజేపీ అభ్యర్థి కీర్తిరెడ్డికి 116, బీఎస్పీ అభ్యర్థి గజ్జి జితేందర్‌కు 10, అడ్లకొండ స్రవంతి(ఆబాద్), అష్రఫ్ మహ్మద్(ఎంసీపీఐ(యూ)), తాళ్లపల్లి రమేష్‌గౌడ్(ఆదార్), వంగర సాంబయ్య(తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా), అల్లం మహేశ్(స్వతంత్ర), వావాలిల లక్ష్మణ్(స్వతంత్ర)కు ఒక్కో ఓటు వచ్చింది. చేపూరి ఓదెలు యాదవ్(బీఎస్‌డీపీ), ఎస్ రమేశ్‌గుప్తా (భారతీయ స్వదేశీ కాంగ్రెస్), మంథెన సంపత్(స్వతంత్ర)కు రెండు చొప్పున, కొత్తూరి రవీందర్(డీఎస్పీ)కు 12, కొటం రవిపటేల్ (స్వతంత్ర), సిరిపెల్లి రాజయ్య(స్వతంత్ర)కు మూడు చొప్పున ఓట్లు వచ్చాయి.

కొండా సురేఖకు 1032..

వరంగల్: పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో కాంగ్రెస్ వరంగల్ తూర్పు అభ్యర్థి కొండా సురేఖకు ఎదురులేకుండా పోయింది. ఆమెకు 1032 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావుకు 423, బీఆర్ఎస్ అభ్యర్థి నన్నపునేని నరేందర్‌కు 248, ఇతరులకు 31 ఓట్లు పోలయ్యాయి. కాగా, మొత్తం 1734 పోస్టల్ ఓట్లు నమోదయ్యాయి.

రాంచంద్రునాయక్‌కు 714..

మహబూబాబాద్ అర్బన్: పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్ డోర్నకల్ అభ్యర్థి జాటోత్ రాంచంద్రునాయక్ దూసుకెళ్లారు. రాంచంద్రునాయక్ 714, బీఆర్ఎస్ అభ్యర్థి ధరంసోత్ రెడ్యానాయక్‌కు 287, బీజేపీ అభ్యర్థి భూక్య సంగీతకు 14 ఓట్లు పోలయ్యాయి. ఇతర అభ్యర్థులందరికీ కలిసి 25 ఓట్లు పడ్డాయి. మొత్తం 1044 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయం

నూతన ఎమ్మెల్యేల మనోగతం

నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పోటీ పడగా డిసెంబర్ 3న జరిగిన కౌంటింగ్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోటీ నెలకొంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 10 సీట్లు కాంగ్రెస్, రెండు బీఆర్ఎస్ గెలుపొందింది. ఈ నేపథ్యంలో గెలిచిన, ఓడిన వారు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

నా విజయం ప్రజలకు అంకితం

హన్మకొండ: నా విజయాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు అంకితం చేస్తా. ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. గత పాలకులు వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తానని ప్రజలను మోసం చేశారు. నేను అలా కాకుండా ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తా. అలాగే, పేదలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తా.

-నాయిని రాజేందర్‌రెడ్డి
వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే

తెలంగాణ ప్రజల గెలుపు..

వరంగల్ : తెలంగాణ ఇచ్చిన వారికే అధికారం ఇస్తే తమ బతుకులు మారతాయని భావించినందునే పెద్ద విజయాన్ని కాంగ్రెస్ పార్టీకి అందించా. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అన్ని అమలు చేస్తాం. తూర్పు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి పాటుపడతా.

- కొండా సురేఖ, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే

అధికారం నుంచి ప్రతిపక్షహోదా ఇచ్చిన ప్రజలు

జనగామ/స్టేషన్‌ఘన్‌పూర్/లింగాలఘణపురం/దేవరుప్పుల/ తొర్రూరు/జనగామ రూరల్/బచ్చన్నపేట/తరిగొప్పుల : తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌కు అధికారంలో నుంచి ప్రతిపక్ష హోదా ఇచ్చారు. ప్రజల తీర్పే శిరోధార్యంగా భావిస్తా. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు ను గౌరవిస్తున్నా. ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ అభివృద్ధికి పాటుపడుతా.

- కడియం శ్రీహరి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

జనగామ : జనగామ ప్రజలు తనపై నమ్మకం ఇచ్చిన గెలుపును నిలబెట్టుకుని, ఈ ప్రాంత అభివృద్ధికి నిరంతరం పాటు పడతా. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు మెజార్టీ సీట్లు రాలేదని బాధ ఉన్నా, ఉద్యమ, ప్రతిపక్ష పాత్ర బలంగా పోషిస్తాం. ప్రజలు పల్లాను కావాలనుకునే ఇట్టి ఘనవిజయాన్ని అందించారు. పార్టీ కార్యకర్తలకు వెన్నంటి ఉంటా, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా.

- పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే

పాలకుర్తి ప్రజలకు రుణపడి ఉంటా

జనగామ/తొర్రూరు/కొడకండ్ల/దేవరుప్పుల: ఎమ్మెల్యేగా గెలిపించి ప్రజా సేవ చేసేందుకు అవకాశం కల్పించిన పాలకుర్తి ప్రజలకు రుణపడి ఉంటా. పాలకుర్తి ప్రజలు మార్పు కోరుకున్నారని, తమ కుటుంబం నియోజకవర్గానికి చేసిన సేవను గుర్తించి ఆదరిస్తా. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతా. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా. ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా చూస్తా. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తా. మేనిఫెస్టో హామీలను అమలు చేసేలా చూస్తా.

- యశస్వినిరెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే

ప్రజాస్వామ్యం గెలిచింది

హసన్‌పర్తి: రాష్ట్రంలో, నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం గెలిచింది. నా గెలుపు కార్యకర్తలకు అంకితం. కార్యకర్తలు,నాయకులు కష్టపడి పనిచేసినందు వల్ల విజయం సాధ్యమైంది. ప్రజలకు అందుబాటులో ఉంటా. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

- కేఆర్.నాగరాజు, ఎమ్మెల్యే, వర్ధన్నపేట

ప్రజల రుణం తీర్చుకుంటా

పరకాల: స్థానికేతరుడిగానే కాకుండా మూడుసార్లు ఓడిన నాయకుడు ఏం చేస్తాడు అంటూ బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అవహేళన చేశారు. అయినా.. పరకాల ప్రజలు ఓటు ద్వారా నాపై చూపించిన అభిమానం జీవితంలో మరిచిపోలేనిది. పరకాలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే కాకుండా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించేలా కృషిచేస్తా.

- రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే

ఇది ప్రజల విజయం

మహబూబాబాద్ : ఈ విజయం ప్రజలది. బీఆర్ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకత, కాంగ్రెస్ మేనిఫెస్టో అన్ని చూసి కాంగ్రెస్‌కు ఓటు వేశారు. కార్యకర్తలు నాయకుల కష్టంతోనే భారీ మెజార్టీ సాధ్యమైంది. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా.

-భూక్య మురళీనాయక్, ఎమ్మెల్యే

ప్రజలకు అందుబాటులో ఉంటా

నర్సంపేట: నాపై నమ్మకంతో గెలిపించిన నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా. నర్సంపేటను అన్ని రంగాల్లో ముందంజలో నడిపిస్తా. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తా. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా. ఇందిరమ్మ పాలనలో నియోజకవర్గ ప్రజలకు పథకాలన్నీ అమలయ్యేలా చొరవ తీసుకుంటా.

- దొంతి మాధవరెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే

సేవ చేసేందుకే రాజకీయాల్లోకి..

మరిపెడ: డాక్టర్ వృత్తిలో ఉన్న నేను ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చా. ఈ నియోజకవర్గం నుంచి రెండుసార్లు పోటీ చేసి మూడోసారి నిలిచిన నన్ను ప్రజలు ఆదరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తా. మీ కొడుకులా, అన్నలా, తమ్ముడిలా పనిచేస్తా.

- రాంచంద్రునాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే

గెలిచింది నియోజకవర్గ ప్రజలే..

ములుగు: ములుగులో ఈ రోజు గెలిచింది నేను కాదు. ప్రజలు గెలుపొందారు. వారి ఆశీర్వాదంతోనే గెలుపొందా. ఎవరికి ఆపద వచ్చినా అండగా ఉంటా. నియోజకవర్గ ప్రజలే నాబలం, నాబలగం. నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటా.

- ధనసరి సీతక్క , ములుగు ఎమ్మెల్యే

అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తా

భూపాలపల్లి/భూపాలపల్లి అర్బన్: రానున్న ఐదేళ్లలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తా. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించకుండా చిత్తశుద్ధితో అమలు చేస్తా. నియోజకవర్గ ప్రజలకు శాయశక్తులా కృషి చేస్తా. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ అందరికీ అందుబాటులో ఉంటా.

- గండ్ర సత్యనారాయణరావు,
భూపాలపల్లి ఎమ్మెల్యే

'నోటా'కే మా ఓటు



ఎన్నికల్లో వివిధ పార్టీల తరఫున లేదా.. స్వతంత్రంగా పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల సంఘం గుర్తులు కేటాయిస్తుంది. అయితే ఓటర్లు తమకు నచ్చిన నాయకుడికి కేటాయించిన గుర్తుపై తమ ఓటు వేస్తారు. అయితే పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చకుంటే పై అభ్యర్థులు ఎవరికీ నాఓటు వేయను అని చెప్పేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నోటా (ఎన్‌ఓటీఏ -నన్ ఆఫ్ ది ఎబో)ను తీసుకొచ్చింది. ఈనేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని 12నియోజకవర్గాల్లో 2014, 2018తోపాటు 2023 ఎన్నికల్లో నోటాకు పడిన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి.

నియోజకవర్గం	2014	2018	2023
వరంగల్ పశ్చిమ	1,704	3,075	2,426
వరంగల్ తూర్పు	2,936	2,716	1,966
వర్ధన్నపేట	2,244	5,842	3,612
భూపాలపల్లి	1,316	1,399	830
ములుగు	1,882	3,249	1,937
పరకాల	918	2,064	966
నర్సంపేట	770	2,409	738
మహబూబాబాద్	1,616	3,279	1,926
డోర్నకల్	1,090	1,962	1,388
పాలకుర్తి	1,103	1,078	2,716
స్టేషన్ ఘన్‌పూర్	3,224	3,540	1,153
జనగామ	858	2,608	2,752



ఎమ్మెల్యేలుగా ఇద్దరు ఎమ్మెల్సీలు

● బీఆర్ఎస్ నుంచి కడియం, పల్లా గెలుపు



కడియం శ్రీహరి



పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ/స్టేషన్ ఘన్‌పూర్/తొర్రూరు/దేవరుప్పుల/కొడకండ్ల: జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా గెలుపొందగా, జనగామ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి శాసన సభ్యుడిగా విజయం సాధించారు.

ఎమ్మెల్యేగా మరోమారు..

కడియం శ్రీహరి ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే బీఆర్ఎస్‌లో కీలక నాయకుడు. 2015లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆ సమయంలోనే తెలంగాణ డిప్యూటీ సీఎంగా, విద్యాశాఖ మంత్రిగా పని చేశారు. 2021లో ఎమ్మెల్యే కోటాలో తిరిగి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీఆర్ పిలుపు మేరకు తెలుగుదేశంలో చేరిన కడియం.. ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రి వర్గంలో వివిధ శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున వరంగల్ ఎంపీగా పోటీ చేసి గెలిచాడు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతూ ఎమ్మెల్యేగా గెలుపొందారు.

తొలిసారి ఎమ్మెల్యేగా..

విద్యా సంస్థల అధినేతగా పేరుగాంచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో తన వంతు చేయూతనందించాడు. వామపక్ష, అభ్యుదయ భావాలు కలిగిన పల్లా 2014లో బీఆర్ఎస్‌లో చేరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా 2015, 2021లో బీఆర్ఎస్ పార్టీ తరఫున బరిలో నిలిచి గెలిచారు. తదనంతరం రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించారు. 2016 నుంచి 2019 వరకు ప్రభుత్వ విప్‌గా పని చేశారు. 2017లో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించాడు. 2018లో శాసన సభలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ) సభ్యుడిగా వ్యవహరించాడు. ప్రస్తుతం జనగామ ఎమ్మెల్యేగా విజయకేతనం ఎగురవేశాడు.

మొరాయించిన ఈవీఎం

హన్మకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఓట్ల లెక్కింపులో ఒక్క ఈవీఎం మొరాయించింది. 7వ రౌండ్‌లో 90వ పోలింగ్ బూత్‌కు చెందిన ఈవీఎం మొరాయించింది. దీంతో తాత్కాలికంగా ఈవీఎంను పక్కన పెట్టి మిగతా రౌండ్లు లెక్కించారు. చివరకు ఈవీప్యాట్ల ద్వారా 90వ పోలింగ్ బూత్ ఓట్లు లెక్కించారు. ఇందులో మొత్తం ఓట్లు 450కి గాను బీఆర్ఎస్‌కు 184 ఓట్లు, కాంగ్రెస్‌కు 125, బీజేపీకి 133 ఓట్లు వచ్చాయి. ఇతరులకు 8 ఓట్లు పడ్డాయి. ఈ ఓట్లను 18వ రౌండ్‌లో కలిపారు.

అసెంబ్లీకి 'ఖాకీ'..

● వర్ధన్నపేట ఎమ్మెల్యేగా మాజీ సీపీ కేఆర్ నాగరాజు
● బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్‌పై గెలుపు

హసన్‌పర్తి : ఓ రిటైర్డ్ పోలీసు అధికారి తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో గెలుపు పొంది అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని ఆయా నియోజకవర్గాల నుంచి పోటీ చేసి పోలీసు అధికారులకు ఇక్కడి ప్రజలు ఆదరించలేదు. ఈ నేపథ్యంలో నిజామాబాద్ సీపీగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన నాగరాజు అనూహ్యంగా తెరపైకి వచ్చారు. సీనియర్లు ఉన్నప్పటికీ టికెట్ దక్కించుకుని వర్ధన్నపేట నుంచి పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్‌పై విజయం సాధించారు.

ప్రచారంలో కూడా వెనుకే..

నాగరాజు ఎన్నికల ప్రచారం అంతంతమాత్రమే చేశారు. ఆయన గెలుపునకు నాయకులు, కార్యకర్తలే కష్టపడ్డారు. నియోజకవర్గంలోని మెజారిటీ గ్రామాల్లో ఓటర్ల వద్దకు వెళ్లి ఈసారి తమకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రభుత్వంపై వ్యతిరేకత నాగరాజు గెలుపునకు ప్రధాన కారణంగా పేర్కొనొచ్చు.

రాజకీయాల్లో సహకరించిన వారికి ధన్యవాదాలు

● ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ మంత్రి



పాలకుర్తి: సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో నాకు సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం అసెంబ్లీ ఎన్నికల లెక్కలు పూర్తి అయిన సందర్భంగా దయాకర్‌రావు విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్య ఎన్నికల్లో మూడు సార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి ఎంపీగా గెలిపించిన ప్రజలందరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అధికారులకు, సిబ్బందికి, తన కోసం పని చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు, బంధువులకు, అభిమానులకు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజలతో మమేకమైనా తప్పని ఓటమి

మరిపెడ : సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ నిత్యం ప్రజల్లో ఉండి సేవ చేసినా ఆయన భారీ మెజారిటీతో ఓడిపోవడంతో ఆయనతో పాటు పార్టీ శ్రేణులు అంతర్మథనంలో పడిపోయారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ నుంచి నాలుగుసార్లు డోర్నకల్‌లో జనరల్ స్థానంలో గెలిచి అయిదోసారి ప్రత్యర్థి సత్యవతిరాథోడ్ చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత తిరిగి ఆరోసారి ఆయన కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొంది బీఆర్ఎస్‌లో చేరారు. 2018లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీచేసి అప్పుడు కాంగ్రెస్ నుంచి ప్రత్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ రాంచంద్రునాయక్‌పై 17,600 ఓట్లతో విజయం సాధించారు. అయితే అప్పుడు నియోజకవర్గంలో సొంత పార్టీలోనే ఉన్న నియోజకవర్గ స్థాయి నాయకులు సహకరించారు. ఆ తర్వాత వారి కేడర్‌ను పక్కన పెట్టినట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి ఎనిమిదోసారి కాంగ్రెస్ నుంచి రాంచంద్రునాయక్, బీఆర్ఎస్ నుంచి రెడ్యానాయక్ పోటీకి దిగారు. అయితే డోర్నకల్ ఎస్టీ రిజర్వుడు ఇదే చివరిసారి కావడంతో తమ పార్టీలో తనపై అలిగి ఉన్న నాయకులందరనీ కూడగట్టుకోవడం కోసం అందరి ఇళ్లకు వెళ్లి కలిసి బుజ్జగించారు. తన కూతురు బీఆర్ఎస్ మహబూబాద్ జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ మాలోతు కవిత, మంత్రి సత్యవతిరాథోడ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్, కుమారుడు రవిచంద్రలాంటి ముఖ్యనాయకులతో పాటు మండల స్థాయి ప్రజాప్రతినిధులు, మరిపెడ, డోర్నకల్ మున్సిపాలిటీల చైర్మన్లు నిత్యం ప్రజలతో మమేకమైనా భారీ ఓటమి చెందడం చర్చనీయాంశంగా మారింది. స్థానిక నాయకత్వం పనితీరు వల్ల ఓట్లు పడలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పవనాలు వీస్తున్న సమయంలో కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న డోర్నకల్‌లో కూడా కాంగ్రెస్ గాలి వీయడంతో రెడ్యానాయక్ ఓటమి చెందారని పార్టీ శ్రేణులు చెబుతున్నారు.

వికసించని కమలం..

ఉమ్మడి వరంగల్‌లో చతికిలపడుతున్న బీజేపీ

● పూర్వ వైభవం కోసం ఆరాటం
● లభించని ప్రజల ఆదరణ
● నాయకుల మధ్య అనైక్యత
● ప్రతి ఎన్నికల్లోనూ భంగపాటు

హన్మకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లాలో కమలం పార్టీ వికసించడం లేదు. ప్రతి ఎన్నికల్లో భంగపాటు తప్పడం లేదు. జిల్లాలో గతంలో కొన్ని నియోజకవర్గాల్లో ప్రాతినిధ్యం వహించిన బీజేపీ.. 1999 తర్వాత జరిగిన ప్రతి ఎన్నికల్లో పరాజయం మూటగట్టుకుంటుంది. పరకాల, రద్దయిన శాయంపేట, వర్ధన్నపేట, హనుమకొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లో గతంలో బీజేపీకి చెందిన శాసన సభ్యులు ప్రాతినిధ్యం వహించారు. అలాగే, పాత హనుమకొండ లోక్‌సభ స్థానం నుంచి కూడా ప్రాతినిథ్యం వహించారు. రద్దయిన శాయంపేట నియోజకవర్గం నుంచి బీజేపీ నుంచి 1978, 1983లో చందుపట్ల జంగారెడ్డి విజయం సాధించారు. 1985, 1989లో పరకాల నుంచి ఒంటేరు జయపాల్ గెలిచారు. వర్ధన్నపేట నుంచి 1985లో వన్నాల శ్రీరాములు, 1989లో టి.రాజేశ్వర్‌రావు గెలుపొందారు. 1999లో రద్దయిన హనుమకొండ నియోజకవర్గం నుంచి మార్తినేని ధర్మారావు విజయం సాధించారు. 1984లో లోక్‌సభ ఎన్నికల్లో దేశంలో రెండు లోక్‌సభ నియోజకవర్గాల నుంచి మాత్రమే బీజేపీ అభ్యర్థులు గెలుపొందగా ఇందులో రద్దయిన హనుమకొండ నుంచి చందుపట్ల జంగారెడ్డి విజయం సాధించడం విశేషం. రాజకీయ ఉద్దండుడు మాజీ ప్రధాని పి.వి.నరసింహారావును (ప్రధాని కాక ముందు) ఓడించారు. 1999 అనంతరం జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ పూర్వ వైభవం చాటుతామని ఆ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుతున్నా ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు.

ప్రతి ఎన్నికల్లో బరిలో..

ప్రతి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు బరిలో ఉంటున్నా ఒక్క అసెంబ్లీ స్థానంలోనైనా పాగా వేయలేకపోతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన తొలి శాసన సభ ఎన్నికల్లోనూ బీజేపీ మరోసారి చతికిలపడింది. రెండోసారి 2018లో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీకి చేదు అనుభవమే ఎదురైంది. ఈ సారి (2023) ఎన్నికల్లోనూ పరాభవం తప్పలేదు. ప్రజల నుంచి ఆదరణ లభించలేదు. ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మ ఇక్కడ పని చేయలేదు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులు పోటీ చేశారు. అయినా ఒక్క స్థానంలోనైనా కమలం వికసించలేదు.

అసంతృప్తులను చేర్చుకున్నా ఫలితం శూన్యం

ఇతర పార్టీల నుంచి అసంతృప్తులను చేర్చుకున్నా ఫలితం లేకుండా పోయింది. తమ పార్టీకి ఉన్న ఓటు బ్యాంకుకు ఇతర పార్టీల నుంచి బదిలీ అయ్యే ఓట్లు కలిపితే విజయం సాధించొచ్చనే అంచనాలను ఓటర్లు తలకిందుల చేస్తున్నారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో బీజేపీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటుంది.

పార్టీని బలోపేతం చేయకుండా ఎన్నికలకు..

టికెట్లు పొందిన వారు ఆ పార్టీలోని అసమ్మతి వాదులను కలుపుకుని పోలేదని ఆరోపణలున్నాయి. నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయకుండా ఎన్నికలకు వెళ్లడం వంటి వైఫల్యాలతో ఆ పార్టీ పూర్వ వైభవం సాధించలేకపోతోందని పరిశీలకులు భావిస్తున్నారు. దీనికి తోడు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను మార్చడం, కర్ణాటకలో అధికారం కోల్పోవడంతో ఒక్కసారిగా బలహీనపడింది. ఈ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నుంచి రావు పద్మ, వరంగల్ తూర్పు నుంచి ఎర్రబెల్లి ప్రదీప్ రావు, వర్ధన్నపేట నుంచి కొండేటి శ్రీధర్, పరకాల నుంచి కాళీ ప్రసాద్, భూపాలపల్లి నుంచి కీర్తి, ములుగు నుంచి అజ్మీరా ప్రహ్లాద్, మహబూబాబాద్ నుంచి జాటోత్ హుస్సేన్ నాయక్, డోర్నకల్ నుంచి భూక్యా సంగీత, జనగామ నుంచి ఆరుట్ల దశమంత రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ నుంచి గుండె విజయరామారావు, పాలకుర్తి నుంచి లేగ రామ్మోహన్ రెడ్డి, నర్సంపేట నుంచి పుల్లారావు పోటీ చేశారు. అయినా జిల్లాలో ఒక చోట కూడా ఖాతా తెరువలేకపోయారు.